


అధ్యక్షులు
డిటర్ ఎఫ్. ఉక్‌డార్ఫ్ గారిచే
**ప్రథమ అధ్యక్షత్వమందు రెండవ సలహాదారులు**

# మనము క్రీస్తును చూడగలమా?

ఒకరోజు రాత్రి నాలుగేళ్ళ తన మనవరాలి కోసం ఒక తాతగారు కథ చదువుతున్నప్పుడు, ఆమె పైకి చూస్తూ, "తాతయ్యా, నక్షత్రాల వైపు చూడండి!" అంది. ఆ ముసలాయన నవ్వుతూ, "మనం లోపల ఉన్నాం. ఇక్కడ నక్షత్రాలేవీ లేవు," అన్నారు. కానీ ఆ పాప మళ్ళీ, "మీ గదిలో నక్షత్రాలున్నాయి! చూడండి!" అని నొక్కి చెప్పింది.

తాతగారు పైకి చూసారు, పైకప్పు మొత్తం మెరుపులు చల్లినట్లుగా ఉండడం చూసి ఆయన ఆశ్చర్యపోయారు. చాలావరకు అది కనిపించదు, కానీ ఆ మెరుపుల మీద వెలుగు పడినప్పుడు, అది నిజంగా నక్షత్రాల మైదానంలా కనిపిస్తుంది. అవి అక్కడే ఉంటాయి, కానీ వాటిని చూడడానికి ఒక చిన్నబిడ్డ దృష్టి కావాలి. ఆ క్షణం నుండి తాతగారు ఎప్పుడు ఆ గదిలోకి వెళ్ళినా పైకి చూసేవారు, ఇంతకుముందు ఆయన చూడలేకపోయిన దానిని చూడగలిగేవారు.

సంగీతం, వెలుగులు, విందులు, బహుమానాలతో నిండిన మరొక అద్భుతమైన క్రిస్టమస్ సమయంలోకి మనము ప్రవేశిస్తున్నాము. కానీ మిగిలిన వారిలా కాకుండా, రక్షకుని నామాన్ని వహించే సంఘ సభ్యులుగా మనము ఈ కాలపు పైమెరుగులను మించి, సంవత్సరము యొక్క ఈ సమయపు అద్భుత సత్యాన్ని, అందాన్ని చూడవలసిన అవసరముంది.

సరిగ్గా అక్కడే, వారికి దగ్గరలో రక్షకుడు జన్మించారని బేత్లెహేములో ఎంతమందికి తెలిసియుండవచ్చని నేను ఆశ్చర్యపడుతున్నాను? దేవుని కుమారుడు, దీర్ఘకాలము వేచియున్న మరియు వాగ్దానము చేయబడిన మెస్సీయ—ఆయన వారి మధ్యనున్నాడు!

దేవదూత గొఱ్ఱెల కాపరులకు ఏమి చెప్పారో మీకు గుర్తుందా? "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు, ఈయన ప్రభువైన క్రీస్తు." అప్పుడు వారిలో వారు ఇలా చెప్పుకున్నారు, "మనము బేత్లెహేము వరకు వెళ్ళి చూతము రండి" (లూకా 2:11, 15).

ఆనాటి గొఱ్ఱెల కాపరుల వలె మనము కూడా మన మనస్సులలో, "జరిగిన దానిని వెళ్ళి చూతము రండి," అని అనుకోవాలి. మన హృదయాలలో ఆ కోరిక కలగాలి. పశువుల పాకలో, దేవాలయంలో, కొండపైన, శిలువపైన ఇశ్రాయేలు పరిశుద్ధుని చూతము రండి. గొఱ్ఱెల కాపరుల వలె, ఈ మహాసంతోషకరమైన సువర్తమానము కొరకు మనము కూడా దేవుని మహిమపరచి, స్తుతించెదము.

ఎప్పుడూ మన కళ్ళెదురుగా ఉన్న వాటినే చూడడం కొన్నిసార్లు కష్టతరమవుతుంది. పైకప్పు మీద ఉన్న నక్షత్రాలను చూడలేకపోయిన తాతగారి వలె, కొన్నిసార్లు మనం స్పష్టంగా కనబడే వాటినే గమనించలేకపోతాము.

దైవ కుమారుని రాక గురించి మహిమకరమైన సందేశాన్ని వినిన మనము, ఆయన నామాన్ని మనపై తీసుకొని, ఆయన శిష్యుల వలె ఆయన మార్గంలో నడిచెదమని నిబంధన చేసిన మనము—నిజంగా ఆయనను చూచేందుకు మన హృదయాలను, మనస్సులను తెరచియుంచడంలో విఫలము కాకూడదు.

క్రిస్టమస్ కాలము అనేక విధాలుగా అద్భుతమైనది. ఇది దయగల కార్యాలకు, సహోదర ప్రేమకు సమయము. ఇది మన స్వంత జీవితాలపై, మనవైన అనేక దీవెనలపై అధికంగా యోచించేందుకు గల సమయము. ఇది క్షమించేందుకు, క్షమింపబడేందుకు గల సమయము. ఇది సంగీతము, వెలుగులు, విందులు, బహుమానాలను ఆనందించేందుకు గల సమయము. కానీ ఈ సమయపు మెరుపు మన దృష్టిని మసకబారనివ్వరాదు మరియు శాంతి

యొక్క రాకుమారుని ఆయన ఘనతలో నిజంగా చూడనివ్వకుండా మనల్ని ఆపరాదు.

ఈ సంవత్సరపు క్రిస్టమస్ సమయాన్ని మనమందరము సంతోషకరమైన, వేడుక సమయంగా, లోకాన్ని విమోచించడానికి తన ఏకైక కుమారుడైన యేసు క్రీస్తును పంపిన సర్వోన్నతుడైన దేవుని అద్భుతకార్యాన్ని గుర్తుచేసుకొనే సమయంగా చేద్దాము!

---

**ఈ సందేశము నుండి బోధించుటకు సూచనలు**

1. "ఆసక్తిని రేకెత్తించుటకు, నేర్చుకొనేవారు పాఠ్యాంశముపై దృష్టిపెట్టేలా సహాయపడేందుకు శ్రద్ధను కలుగజేయు ప్రోత్సాహ కార్యక్రమాలను ఉపయోగించవచ్చు. . . . పాఠపు ముఖ్యాంశమును బలపరిచేందుకు, నేర్చుకొనేవారు శ్రద్ధవహించేలా సహాయపడేందుకు చిత్రపటములు విలువైన సాధనాలు కాగలవు" (బోధన, గొప్ప పిలుపు కాదు (1999), 160, 176). ఈ సందేశాన్ని పంచుకోవడాన్ని మీరు ఆరంభించినప్పుడు, ఒక చిత్రపటాన్ని చూపడం లేక ఒక లేఖనాన్ని పంచుకోవడం మరియు అది ఏ విధంగా ఈ సందేశానికి అన్వయింపబడుతుందో ఆలోచించమని కుటుంబ సభ్యులను అడగడం వంటి శ్రద్ధను కలుగజేయు ప్రోత్సాహ కార్యక్రమాన్ని ఒకదానిని ఉపయోగించడం గురించి ఆలోచించవచ్చు.

2. "అనుదిన పరిస్థితులలో సువార్త సూత్రాలను అన్వయించేలా ఇతరులకు సహాయపడడమే మీ అతి ముఖ్యమైన లక్ష్యాలలో ఒకటి కావాలి. . . . మనము సువార్తను జీవించినప్పుడు వచ్చే దీవెనలను కనుగొనేలా నేర్చుకొనేవారికి సహాయపడుము" (బోధన, గొప్ప పిలుపు కాదు, 159). ఈ సందేశాన్ని పంచుకొనిన తర్వాత, క్రిస్టమస్ సమయంలో వారు రక్షకునిపై దృష్టి కేంద్రీకరించినప్పుడు వారికి కలిగిన అనుభవాలను పంచుకోమని కుటుంబ సభ్యులను ఆహ్వానించవచ్చు.

## యువత

## మిషనరీ క్రిస్టమస్

**లోరన్ కుక్ చేత**

పూర్తి-కాల మిషనరీగా నా రెండవ క్రిస్టమస్ సమయంలో, ఇటీవల బాప్తీస్మము పొందిన ఒక సభ్యురాలిని, ఆమె కుటుంబాన్ని నేను, నా సహవాసి దర్శించాము. గొప్ప క్రిస్టమస్ భోజనం తర్వాత, మేము వారితో క్రిస్టమస్ సందేశాన్ని పంచుకున్నాము.

ఈ సమయాన్ని వారికి గుర్తు చేసే విషయాలు–నక్షత్రాలు, బహుమానాలు, జననము, క్రిస్టమస్ చెట్లు వంటి వాటిని బొమ్మలుగా గీయమని మేము ఆ కుటుంబాన్ని అడిగాము. తర్వాత 2 నీఫై 19:6తో పాటు కొన్ని లేఖనాలను చదివాము: "ఏలయనగా, మనకు ఒక శిశువు పుట్టెను, మనకు ఒక కుమారుడు అనుగ్రహింపబడెను; మరియు ఆయన భుజము మీద రాజ్యభారముండును; మరియు ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, శాంతి యొక్క రాకుమారుడు అని అతనికి పేరు పెట్టబడును." మేము "Once in Royal David's City" (కీర్తన, సం. 205) పాడాము, క్రీస్తు జననము గురించి ఒక సినిమా చూసాము, యేసు క్రీస్తు గురించి సాక్ష్యమిచ్చాము.

మా కుటుంబాల నుండి మరియు మామూలుగా జరిగే క్రిస్టమస్ వేడుకల నుండి దూరంగా అతిసాధారణ పరిస్థితులలో జరుపుకున్న క్రిస్టమస్ అది, కానీ మేము రక్షకుని గురించి సాక్ష్యమిచ్చినప్పుడు, ఆయన పట్ల మరియు ఆయన జననము పట్ల ఎన్నడూ లేనంత లోతైన ప్రేమను, అభినందనను నేను అనుభవించాను. నా పరలోక తండ్రికి పూర్తి-కాల మిషనరీగా సేవ చేయడంలో ఇది నా చివరి క్రిస్టమస్ అని నేను గుర్తించాను, కానీ నేనెక్కడ ఉన్నప్పటికీ ఆయన కుమారుని గురించి ఆయన ఆత్మ నాకు సాక్ష్యమివ్వగలదని నేను గ్రహించాను.

## పిల్లలు

## రక్షకుని చూచేందుకు వెదకుట

క్రిస్టమస్ సమయంలో రక్షకుని జీవితాన్ని మనకు జ్ఞాపకం చేయగల విషయాల కొరకు మనము వెదకవలెనని అధ్యక్షులు ఉక్‌డార్ఫ్ చెప్పారు. ఆయన జీవితంలో కొన్ని ముఖ్య ఘట్టాల గురించి నేర్చుకొనేందుకు క్రింది లేఖన సూచనలను చూడుము.

మత్తయి 2:1–2
లూకా 2:46
మత్తయి 15:32–38
లూకా 8:49–55
లూకా 23:33–34, 44–46
యోహాను 20:11–20

© 2010 by Intellectual Reserve, Inc. అన్ని హక్కులు కలిగియున్నది. భారతదేశంలో ముద్రించబడినది. ఆంగ్ల ఆమోదము: 6/09. అనువాద ఆమోదము: 6/09. Translation of *First Presidency Message, December 2010*. డిశంబరు 2010, ప్రథమ అధ్యక్షత్వ సందేశము యొక్క అనువాదము. Telugu. 09372 421

# దేవాలయము మరియు కుటుంబ చరిత్ర కార్యములో పాల్గొనుటలో మన బాధ్యత

*ఈ సందేశాన్ని చదువుము మరియు మీరు దర్శించు సహోదరీలతో తగిన విధంగా దీనిని చర్చించుము. మీ సహోదరీలను బలపరచుటలో సహాయపడేందుకు మరియు ఉపశమన సమాజమును మీ స్వంత జీవితంలో క్రియాశీలకంగా చేసేందుకు ప్రశ్నలను ఉపయోగించుము.*

**విశ్వాసము**
**కుటుంబము • ఉపశమనము**

ఎన్నో శతాబ్దాలుగా అనేకమంది సువార్త యొక్క జ్ఞానము లేకుండానే మరణించారు. వారిలో కొందరు మీ దగ్గరి మరియు దూరపు బంధువులు. మీ కుటుంబాలను జతచేయడానికి మరియు వారి తరపున రక్షణ విధులను నిర్వర్తించడానికి కావలసిన పరిశోధనను మీరు చేయాలని వారు వేచియున్నారు.

ప్రపంచంలోని అనేక దేవాలయాలు తగినంత పని లేకుండా ఉన్నాయి. ఆయన రాకడ సమయంలో భూమియంతయు పూర్తిగా నాశనము చేయబడకుండునట్లు మీ హృదయాలు తండ్రుల తట్టు తిరుగునని ప్రభువు వాగ్దానమిచ్చారు (సి & ని 2:2–3 చూడుము).

దేవాలయము మరియు కుటుంబ చరిత్ర కార్యములో పాల్గొనుట ఫలితముగా మీరు వ్యక్తిగత దీవెనలను పొందుతారు. వాటిలో ఒకటి, మీ పూర్వీకులకు సేవచేసినప్పుడు మీరు పొందే ఆనందము. మరొకటి మీరు దేవాలయ సిఫారసు కొరకు యోగ్యులగుట, అది ప్రభువు యెదుట మీ యోగ్యతను చూపును. సిఫారసును పొందుటకు నేడు అర్హత లేని వారు వీలైనంత త్వరగా దానికి అర్హులయ్యేలా బిషప్పు లేక శాఖాధ్యక్షునితో కలిసి పనిచేయవలెను. ఈ ముఖ్యమైన అర్హత లేకుండా ఉండవద్దు. ప్రాయశ్చిత్తఃము నిజమని, సరైన పశ్చాత్తాపముతో పాపములు క్షమించబడగలవని నేను సాక్ష్యమిస్తున్నాను.

దేవాలయము మరియు కుటుంబ చరిత్ర కార్యములో మనము పాల్గొన్నప్పుడు, మన సవాళ్ళలో ఓదార్చేందుకు మరియు ముఖ్యమైన నిర్ణయాలలో మనల్ని నడిపించేందుకు మనము నిశ్చయముగా ఆత్మను కలిగియుండెదము. దేవాలయము మరియు కుటుంబ చరిత్ర కార్యము మన పూర్వీకులకు ఉపశమనాన్ని కలిగించే లేక సేవనందించే మన పనిలో భాగము.

***జూలీ బి. బెక్, ఉపశమన సమాజ ప్రధాన అధ్యక్షురాలు***

## *From the Scriptures*

మలాకీ 4:5–6; 1 కొరింథీయులకు 15:29; 1 పేతురు 3:18–19; సి & ని 110:13–16; 128:24 లేఖనముల నుండి

## *మన చరిత్ర నుండి*

"ప్రవక్తయైన జోసెఫ్ స్మిత్ ఇలా చెప్పారు, 'మరణించిన మన వారిని వెదకడమే ఈ లోకంలో దేవుడు మనపై ఉంచిన గొప్ప బాధ్యత' (సంఘ చరిత్ర, 6:313). ఆరంభము నుండి, ఉపశమన సమాజ సహోదరీలు ఈ గొప్ప కార్యములో సహకారమందించారు. 1842లో నావూలో, దేవాలయ నిర్మాణ కార్మికులకు సహాయపడాలనే శారా ఎమ్. కింబల్ కోరిక కొంతమంది సహోదరీలు తమనుతాము సమూహంగా ఏర్పరచుకొనేలా ప్రేరేపించింది, ఆవిధంగా వారు మరింత ప్రభావవంతంగా సేవచేయగలిగారు. వారు కలుసుకొనుట ఆరంభించినప్పుడు, ప్రవక్త . . . యాజకత్వపు విధానాన్ని అనుసరించి మొదటి ఉపశమన సమాజాన్ని ఏర్పాటు చేసారు. ఆ సమయము నుండి, ఉపశమన సమాజ సహోదరీలు నావూ దేవాలయ కార్యము ముందుకు సాగేందుకు సహాయపడ్డారు. . . .

"1855లో, మొదటిసారి పరిశుద్ధులు యూటాకు చేరిన ఎనిమిది సంవత్సరాల తర్వాత, ఎండోమెంట్ హౌస్ స్థాపించబడింది. మొదటి ఉపశమన సమాజపు సభ్యులలో ఒకరైయుండి, ఆ సంస్థ యొక్క గ్రంథాలను కాపాడిన ఎలైజా ఆర్. స్నో ఉపశమన సమాజ ప్రధాన అధ్యక్షురాలిగా ఉండేందుకు 1866లో అధ్యక్షులు బ్రిగమ్ యంగ్ చేత పిలువబడ్డారు. ఆమె మరియు ఇతర సహోదరీలు ఎండోమెంట్ హౌస్‌లో విశ్వాసముగా పనిచేసారు. తర్వాత, సెయింట్ జార్జ్, లోగన్ మరియు మాంటై దేవాలయాలు పూర్తయినప్పుడు, మరణించిన వారి కొరకు అక్కడ పనిచేయగలిగేందుకు ఈ సహోదరీలు ప్రతి ఒక్క దేవాలయానికి ప్రయాణించారు."[1]

**వివరణ**

1. Mary Ellen Smoot, "Family History: A Work of Love," *Ensign,* Mar. 1999, 15.

## *నేనేమి చేయగలను?*

1. నా సహోదరీలు వారి పూర్వీకులను కనుగొని, వారి కొరకు దేవాలయ విధులను నిర్వర్తించేలా నేనెలా సహాయపడగలను? ఆమె అవసరాలను ఎలా తీర్చాలని మీరు ఆలోచిస్తున్నప్పుడు, ప్రతి సహోదరి యొక్క పరిస్థితుల గురించి ఆలోచించుము. కుటుంబ చరిత్ర కార్యము తరచుగా క్రొత్త, తిరిగివచ్చు మరియు తక్కువ-ఉత్సాహవంతులైన సభ్యులను బలపరచగలదని మీరు ఆలోచించవచ్చు.
2. దేవాలయము మరియు కుటుంబ చరిత్ర కార్యము నా సవాళ్ళలో ఎప్పుడు నన్ను ఓదార్చింది లేక ముఖ్యమైన నా నిర్ణయాలలో ఎప్పుడు నన్ను నడిపించింది?

http:/// అధిక సమాచారం కొరకు, www.reliefsociety.lds.org చూడండి.

© 2010 by Intellectual Reserve, Inc. అన్ని హక్కులు కలిగియున్నది. భారతదేశంలో ముద్రించబడినది. ఆంగ్ల ఆమోదము: 6/09. అనువాద ఆమోదము: 6/09.
Translation of *Visiting Teaching Message, December 2010*. డిశంబరు 2010, దర్శించి బోధించు సందేశము యొక్క అనువాదము. Telugu. 09372 421